సాక్షి శ్రీకాకుళం

I

శనివారం, 22, జూలై, 2023

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ యూనివర్సిటీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో శనివారం డయల్ యువర్ యూనివర్సిటీ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం వర్సిటీలో మాట్లాడుతూ శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య ఫోన్ ఇన్ లైన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 8247861919 నంబర్‌కు ఫోన్ చెయ్యాలని అన్నారు. వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, అధికారులు పాల్గొంటారని చెప్పారు.

'సిబ్బంది సంక్షేమమే ప్రధానం'

శ్రీకాకుళం క్రైమ్ : నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమైన పోలీసు సిబ్బంది సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, వృత్తిపరంగా, ఆరోగ్యపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కారం దిశగా కృషిచేస్తామని జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. పోలీసు సిబ్బంది సమస్యలపై శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బంది ఆరోగ్యపరమైన, శాఖాపరమైన, వృత్తిపరమైన సమస్యలపై అర్జీలు సమర్పించగా ఎస్పీ క్షుణ్ణంగా వాటిని పరిశీలించారు. ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందించి వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా గొండు కృష్ణమూర్తి



ధర్మాన కృష్ణదాస్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న గొండు కృష్ణమూర్తి తదితరులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా గొండు కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు వెలువరించింది. గొండు కృష్ణమూరి ఈ నెల 21వ తేదీ నుంచి 2024 జనవరి (6 నెలల పాటు) వరకు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. గతంలో ఈయన డీసీఎంఎస్ చైర్మన్‌గా పనిచేసి ఉన్నారు. ప్రస్తుతం డీసీఎంఎస్ పాలక మండలిలో బోర్డు డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. ప్రస్తుత పాలకమండలిలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన సల్లా సుగుణా దేవరాజును బోర్డు డైరెక్టర్‌గా నియమించారు. కృష్ణమూర్తి నియామకంపై వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులు హర్షం వ్యక్తంచేశారు. అనంతరం గొండు కృష్ణమూర్తి, పార్టీ నేతలు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ను కూడా మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

తోటి ఉద్యోగుల మన్ననలు పొందడమే నాయకత్వం



జెడ్పీ చైర్‌పర్సన్ విజయను కలిసిన అధ్యక్ష, ఉపాధ్యక్ష కార్యవర్గ సభ్యులు

అరసవల్లి: తోటి ఉద్యోగుల సమస్యలపై స్పందించి వారి మన్ననలు పొందిన వారే ఉద్యోగ సంఘ నాయకులుగా గుర్తింపు పొందుతారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గ సభ్యులంతా శుక్రవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాయితీగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే క్రమంలో తనవంతు సహాయం తప్పక ఉంటుదన్నారు. కార్యక్రమంలో జెడ్పీ యూనిట్ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు దుంపల అప్పన్న, మానపు సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.రామేశ్వరరావు, కోశాధికారి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్‌ను కూడా కలిసి సత్కరించారు.

24న ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ ఈనెల 24వ తేదీ సోమవారం ఉదయం 8 గంటల నుంచి అనివెట్టి మండపంలో నిర్వహిస్తున్నట్లుగా ఆలయ ఈఓ వి.హరి సూర్యప్రకాష్ తెలియజేశారు. గ్రామపెద్దలు, రెవెన్యూ, పోలీస్, దేవదాయ శాఖ జిల్లా అధికారుల పర్యవేక్షణలో హుండీలను తెరిపించి, లెక్కింపు చేపడతామని ప్రకటించారు.

కిడ్నీ వ్యాధిపై యుద్ధం

జలాస్త్రం సిద్ధం

వంశధార అమృత ధారలా మారి ఉద్దానం గొంతు తడపనుంది. దశాబ్దాలుగా ఉద్దానాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ మహమ్మారిపై యుద్ధానికి ఈ జలాస్త్రాన్ని సర్కారు సంధించనుంది. దీనికి తోడుగా కిడ్నీ ఆస్పత్రి పనులు కూడా జోరుగా జరుగుతుండడం ఈ ప్రాంతానికి శుభ సూచిక. వందల కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు దాదాపు పూర్తయ్యింది. తాజాగా అధికారులు ప్రాథమికంగా ట్రయల్ రన్ వేశారు. మరోసారి ట్రయల్ రన్ వేసి జనాలకు జలాలు పంచడమే ఇక తరువాయి. ఆ రోజు కూడా ఎంతో దూరంలో లేదు.

- సిద్ధమైన ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు
- ప్రాథమిక ట్రయల్ రన్ వేసిన అధికారులు
- హిరమండలం రిజర్వాయర్ నుంచి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు నీరు విడుదల
- మట్టి, లీకులు తదితర లోపాలను గుర్తించేలా ప్రాథమిక ట్రయల్ రన్
- త్వరలోనే అధికారిక ట్రయల్ రన్
- ఆ తర్వాత సీఎం చేతులమీదుగా ప్రారంభోత్సవం



హిరమండలం రిజర్వాయర్ వద్ద నిర్మించిన ఇంటేక్ వెల్ వంతెన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఉద్దానం ప్రజలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. దశాబ్దాలుగా కిడ్నీ మహమ్మారి బారిన పడి నిర్జీవంగా మారిన ఈ ప్రాంతం గొంతులో అమృతం పోసేలా ప్రభుత్వ భారీ మంచినీటి పథకాన్ని నిర్మించింది. ఈ ఉద్దానం ప్రాజెక్టు పనితీరు తెలుసుకునే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఇందులో భాగంగా హిరమండలం రిజర్వాయర్ నుంచి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోకి వంశధార జలాలను గురువారం రాత్రి వదిలారు. శుద్ధి చేసిన జలాలను పైపులైన్ల ద్వారా ట్యాంకులకు ఒత్తిడితో పంపించారు. ఎక్కడైనా పైపులైనులో మట్టి కూరుకుపోయినా, లీకేజీ తదితర లోపాలు ఉన్నా గుర్తించేందుకు వీలుగా ప్రాథమిక ట్రయల్ రన్ నిర్వహించారు. ఇప్పటివరకైతే అంతా విజయవంతంగానే సాగింది. అంతా సవ్యంగా ఉందని నిర్ధారించాక అధికారిక ట్రయల్ రన్ నిర్వహించి, ఆ తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభించనున్నారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధికి చరమగీతం పాడాలన్న ఉద్దేశంతో అక్కడి ప్రజలకు భూ ఉపరితలం నుంచి శుద్ధి చేసిన వంశధార జలాలను అక్కడికి పంపించేందుకు రూ.700 కోట్లతో భారీ మంచినీటి పథకాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చాక జిల్లాలో చేపట్టిన తొలి బృహత్తర కార్యక్రమంగా ఉద్దానం మంచినీటి ప్రాజెక్టుకు ప్రాధాన్యమిచ్చారు. మధ్యలో కోవిడ్ వల్ల పనుల్లో జాప్యం జరిగింది. ఆ తర్వాత జోరు పెరిగింది. పనులు ప్రస్తుతం దాదాపు పూర్తయ్యాయి.

ప్రాజెక్టు ఉద్దేశమిది..

ఉద్దానం ప్రాంతంలోని పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ఏడు మండలాలతో పాటు పాతపట్నం నియోజకవర్గం మెళియాపుట్టి ప్రజలకు శుద్ధి జలం అందించేందుకు పనులు చేపట్టింది.



శుద్ధి చేసిన నీటిని నిల్వ చేసే ట్యాంకు

- 2051కు ఉండే జనాభాను అంచనా వేసి, ప్రతి వ్యక్తికి 100 లీటర్ల నీటిని అందించేందుకు ప్రాజెక్టు రూపకల్పన జరిగింది.
- ప్రస్తుతం ఏడు మండలాల పరిధిలోని 809 గ్రామాల్లో 5లక్షల వరకు జనాభా ఉన్నారు.
- 2051నాటికి 7.8లక్షలకు పెరగొచ్చనే అంచనాతో రోజుకి 840 లక్షల లీటర్ల శుద్ధి జలాన్ని అందించేలా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు.
- హిరమండలం రిజర్వాయర్ నుంచి సంవత్సరానికి 1.12 టీఎంసీల నీటిని వినియోగించనున్నారు.



ప్రాజెక్టు పైపులైన్

ప్రాజెక్టు స్వరూపం

- హిరమండలం రిజర్వాయర్ నుంచి ఇచ్ఛాపురం వరకు తాగునీటిని తరలించేందుకు 1047 కిలోమీటర్ల పొడవునా భూగర్భ పైపు లైన్ వేశారు.
- ఎంఎస్(మైల్డ్ స్టీల్) పైపు లైన్ 50 కిలోమీటర్ల మేర, డీఐ పైపు లైన్ 150 కిలోమీటర్ల మేర, హెచ్‌డీపీఈ(హై డెన్సిటీ పాలీ ఎథిలిన్)పైపులైన్ 850 కిలోమీటర్ల మేర వేశారు.
- 530 మీటర్ల మేర హిరమండలం రిజర్వాయర్ వద్ద అప్రోచ్ వంతెన నిర్మించారు.
- హిరమండలం రిజర్వాయర్ వద్ద 33 మీటర్ల లోతు నుంచి 148 మీటర్ల ఎత్తు వరకు వాటర్ పంపింగ్ చేస్తారు.
- పంపింగ్ కోసం 1300 హెచ్‌పీ గల మూడు పంపు సెట్‌లను ఏర్పాటు చేశారు. అందులో రెండు వర్కింగ్‌లో, ఒకటి స్టాండ్‌బైగా ఉంటుంది. దాని కోసం ఇంటాక్ వెల్ పంప్ హౌస్ నిర్మించారు.
- ప్రతి రోజూ 22 గంటలు పంపింగ్ చేసే సామర్థ్యంతో రెండు భారీ మోటార్లు ఒక్కో నిమిషానికి 28 వేల లీటర్లకు పైగా నీటిని పంపింగ్ చేయనున్నాయి. విద్యుత్ సరఫరా చేసేందుకు 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారు.
- ఎగుడు, దిగుడు కొండలు, మైదాన ప్రాంతాలు దాటుకుని 32 కిలోమీటర్ల దూరంలో ఉన్న మెళియాపుట్టి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(శుద్ధి కేంద్రం)కు నీరు చేరేలా పనులు చేపట్టారు.
- కొరసవాడ వద్ద 2000 కిలో లీటర్ల ట్యాంకర్, మెళియాపుట్టి వద్ద 84ఎంఎల్‌డీ సామర్థ్యం గల నీటి శుద్ధి ట్యాంకుల నిర్మాణం చేపట్టారు.
- అక్కడ ఏర్పాటు చేసిన శుద్ధి కేంద్రంలోకి పంపించి నీటిని శుభ్ర పరుస్తారు. నీటిని శుద్ధి చేయడానికి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఫిల్టర్ బెడ్‌ల కేంద్రాన్ని ఏర్పాటుచేశారు.
- నీటి తరలింపు మార్గంలో వంశధార నది ఉండటంతో నదీ గర్భంలో దాదాపు అరకిలోమీటర్ మేర పైపు లైన్ నిర్మాణం చేపట్టారు. కొన్నిచోట్ల కొండలను తొలిచి 79 మీటర్ల ఎత్తుకు...ఆపై 50 మీటర్ల దిగువకు... మళ్లీ 147మీటర్ల ఎత్తున ఉండే కొండపైకి, మళ్లీ దిగువకు పైపు లైన్ నిర్మించారు.
- 700 మీటర్ల నది క్రాసింగ్ పనులు చేపట్టారు.
- రెండు నియోజకవర్గాల్లో 571 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు.
- మెళియాపుట్టి వద్ద 9000 కిలో లీటర్ల వాటర్ సంప్, పలాస, ఇచ్ఛాపురంలో 1000 కిలో లీటర్ల వాటర్ సంప్‌లు నిర్మించారు. మెళియాపుట్టి శుద్ధి కేంద్రం వద్ద మరో సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారు.

తాజాగా ప్రాథమిక ట్రయల్ రన్..



ప్రాథమిక ట్రయల్ రన్‌లో భాగంగా నీరు వదిలిన దృశ్యం

- హిరమండలం రిజర్వాయర్ వద్ద 1300 హెచ్‌పీతో ఏర్పాటుచేసిన మూడు మోటార్లతో గురువారం రాత్రి ప్రాథమిక ట్రయల్ రన్ నిర్వహించారు.
- హిరమండలం రిజర్వాయర్ నుంచి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తొలుత నీరు వదిలారు.
- సుమారు తొమ్మిది గంటల పాటు ఇంటేక్ వెల్ నుంచి వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్‌లోకి 850 లక్షల లీటర్ల నీటిని ఎత్తిపోశారు.
- అక్కడ శుద్ధి చేసిన నీటిని ప్రెజర్(ఒత్తిడి)తో పైపులైన్ల ద్వారా ట్యాంకులకు పంపించే కార్యక్రమం చేపట్టారు.
- ఎక్కడైనా పైపు లైన్‌లో మట్టి పేరుకుపోతే ఒత్తిడితో కూడిన నీటి ద్వారా క్లీన్ కానున్నాయి.
- రిజర్వాయర్ వద్ద నీటి మళ్లింపు, మోటార్ల ద్వారా ఎత్తిపోతలు విజయవంతమయ్యాయి.
- లోపాలు అధ్యయనం చేసే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది.

'పేద ప్రజల ఆరోగ్య ప్రదాత వైఎస్సార్'



వైఎస్సార్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పేద ప్రజలకు ఆరోగ్య ప్రదాతగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో రెండు వందల పడకల కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వద్ద వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా చూడాలనేది వైఎస్సార్ కల అని అన్నారు. ఆరోగ్య శ్రీ తీసుకురావడం, జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ స్థాపించడం ఆయనకే చెల్లిందన్నారు. ఉద్దానం ప్రజల కోసం కిడ్నీ ఆస్పత్రి కట్టడం మన ప్రాంతంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. ఇప్పటికే ఆస్పత్రిలో సీటీస్కాన్, ఎమ్మారై స్కాన్‌తో పాటు పూర్తి స్థాయి సాంకేతిక పరికరాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే మెడికల్, నాన్ మెడికల్ సిబ్బందిని ఎంపిక చేయడం కూడా జరిగిందని తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ రీజనల్ రీసెర్చ్ ఆస్పత్రిగా నామకరణం చేసేందుకు నాలుగు నెలలు కిందటే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని అన్నారు. కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, పలాస ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీ శంకర్, పీఏసీఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు, దువ్వాడ మధుకేశ్వరరావు, మున్సిపల్ వైఎస్ చైర్మన్ బోర కృష్ణారావు, మీసాల సురేష్, వాణిజ్య విభాగ అధ్యక్షుడు బెల్లాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రారంభానికి సిద్ధమవుతున్న కిడ్నీ రీసెర్చ్‌సెంటర్, 200 పడకల సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి

పోలీసుల్లో నైపుణ్యాలు కీలకం: ఎస్పీ

పోలీసుల్లో నైపుణ్యాలు కీలకమని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో శుక్రవారం ఏఆర్ పోలీసులు ప్రత్యేక పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఎస్పీ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసుల్లో దేహ దారుఢ్యం కీలకమని చెప్పారు. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలన్నారు. అనంతరం ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి, డీఎస్పీలు వై.శృతి, డి.ప్రసాదరావు, జి.వి ప్రసాద్‌లు పాల్గొన్నారు. – ఎచ్చెర్ల క్యాంపస్



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ రాధిక

కామెంట్ బాక్స్

దేశంలోనే అత్యుత్తమ సీఎం వైఎస్ జగన్




ప్రజల గడప వద్దకే చక్కటి పాలనను తీసుకువచ్చి దేశంలోనే అత్యుత్తమ సీఎంగా వైఎస్ జగన్ నిలిచారు. మేనిఫెస్టోను దైవంగా భావించి ఇప్పటికే 99 శాతం హామీలు అమలు చేశారు. ఆయా పథకాలు లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపాయి. ఆయనపై ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలి.
– తమ్మినేని సీతారాం, స్పీకర్(ఆమదాలవలసలో నిర్వహించిన గడపగడపకూ కార్యక్రమంలో..)

మధ్యవర్తులు లేని పాలన మాది



అవినీతికి తావు లేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పాలన అందిస్తున్నాం. ఎన్నికల వేళ టీడీపీ నాయకులు వచ్చి కిలో బంగారం ఇస్తామన్నా వారిని నమ్మొద్దు. గతంలో ఇలాగే చెప్పి రైతులు, డ్వాక్రా మహిళలను మోసం చేశారు. వైఎస్ జగన్ ఒక్కరే హామీలన్నీ అమలు చేశారు.
– ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ మంత్రి(శ్రీకాకుళంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో..)

భయం వీడండి.. ఓటు వేయండి



అచ్చెన్నాయుడు స్వగ్రామమైన నిమ్మాడ పంచాయతీలో గత నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా రూ.26.22 కోట్లు లబ్ధిదారులకు ప్రభుత్వం అందించింది. పార్టీలకు అతీతంగా వైఎస్సార్ సీపీ సంక్షేమాన్ని అందరికీ అందించింది. ముప్పై ఏళ్ల రాజకీయ చరిత్రలో కింజరాపు కుటుంబం పేదలకు చేసిందేమీ లేదు. నిమ్మాడ వాసులంతా భయం వీడి బయటకు రావాలి. మేము అండగా ఉంటాం.
– దువ్వాడ వాణి, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త (నిమ్మాడలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో..)

చేనేతకు చేయూత



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

- వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా జిల్లాలో 1460 మందికి రూ.3.51కోట్లు లబ్ధి
- వరుసగా ఐదో ఏడాది నేతన్న నేస్తం సాయం

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ నేతన్న నేస్తం చేనేత కుటుంబాలకు వరమని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ఐదో విడత నగదు విడుదల కార్యక్రమం తిరుపతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మన జిల్లాలో నేతన్నలు తయారు చేసిన ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు మార్కెటింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ నగదును పెట్టుబడిగా పెట్టి ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమై 20 రోజులు పూర్తయ్యిందని, ఇప్పటివరకు జిల్లాలో సుమారు 1లక్షా 70 వేలు వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశామన్నారు. నేతన్న నేస్తం పథకం కింద ఈ సంవత్సరంలో 1,460 మందికి రూ.3.51కోట్ల ప్రయోజనం చేకూరుతుందన్నారు. చేనేత శాఖ ఏడీ ఐ.ధర్మారావు మాట్లాడుతూ ఈ సాయంతో మరమగ్గాలను ఆధునీకీకరించుకోవాలని సూచించారు. జిల్లాలో 50 ఏళ్లు దాటిన 3,812 మంది చేనేత కార్మికులకు నెలకు రూ.2,750 చొప్పున చేనేత పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కులను అందజేశా రు. సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ, డెవలప్‌మెంట్ ఆఫీసర్ శేఖర్, శ్రీను, ఏడీఓ రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం ఇలా....

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019-2020	1457	రూ 3.50కోట్లు
2020-2021	1775	రూ.4.26కోట్లు
2021-2022	1208	రూ.2.89కోట్లు
2022-2023	1294	రూ.3.10కోట్లు
2023-2024	1460	రూ.3.51కోట్లు

అభిమానుల ప్రార్థనలే కాపాడాయి

బైక్ ప్రమాదం తర్వాత ఆలయాల్లో అభిమానులు చేసిన ప్రార్థనలే తన ప్రాణాలను నిలబెట్టాయని మెగా హీరో సాయిధరమ్‌తేజ్ అన్నారు. ఆయన శుక్రవారం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తమ అభిమాన కథానాయకుడిని చూసేందుకు ఫ్యాన్స్ భారీగా తరలివచ్చారు. ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి తదితరులు ఆయనకు గౌరవ స్వాగతం పలికి అంతరాలయంలో గోత్రనామాలతో పూజలు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం హీరో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ 'బ్రో' చిత్రం త్వరలో విడుదల కానుందని, చిత్రం విజయం కావాలని, అలాగే అందరి ఆరోగ్యం బాగుండాలని కోరుకుంటూ ఆదిత్యునికి పూజలు చేశానని, మొక్కు చెల్లించుకున్నానని వివరించారు. ఈ సందర్భంగా అభిమానులు ఆయనకు భారీగా స్వాగతం పలుకుతూ క్రేన్ సహాయంతో భారీ గజమాలను వేశారు. ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథుడిని ఆయన శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. – అరసవల్లి



ఆదిత్యుని జ్ఞాపికను హీరో సాయిధరమ్‌తేజ్‌కు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

క్లుప్తంగా

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



సమీక్షలో పాల్గొన్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువర్ణ, అధికారులు

శ్రీకాకుళం అర్బన్ : గ్రంథాలయాలు యువతకు మరింత చేరువకావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయాధికారులు, బీడీసీ నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. లైబ్రరీలను డిజిటలైజేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో సువ్వారి సత్యనారాయణ, కార్యదర్శి బి.కుమార్‌రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఏటీఎం సెంటర్‌లో మోసం

టెక్కలి రూరల్: ఏటీఎం సెంటర్ వద్ద మోసం జరిగిందంటూ టెక్కలి మండలం వేములవాడ విశ్వనాథపురం గ్రామానికి చెందిన వృద్ధుడు పత్రి రాజారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టెక్కలి ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2న రాజారావు తన ఏటీఎం కార్డును పట్టుకుని టెక్కలి ఏటీఎం సెంటర్ వద్దకు వచ్చాడు. తనకు డబ్బులు విత్ డ్రా చేయడం రాకపోవడంతో సమీపంలో గుర్తు తెలియని వ్యక్తికి ఇచ్చాడు. రూ.రెండు వేలు డ్రా చేయాలని చెప్పడంతో ఆ వ్యక్తి రూ.2వేలు తీసి వృద్ధుడికి ఇచ్చాడు. ఆ సమయంలో వేరే ఏటీఎం కార్డును వృద్ధుడు ఇవ్వడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం సదరు గుర్తు తెలియని వ్యక్తి వేరువేరు ఏటీఎం సెంటర్‌ల నుంచి సుమారు లక్ష రూపాయలు విత్ డ్రా చేసినట్లు తెలుసుకున్న బాధిత వృద్ధుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదుచేశాడు.ఈ మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్ఐ-2రమేష్‌బాబు తన సిబ్బందితో కలిసి టెక్కలిలో ఉన్న ఏటీఎం సెంటర్ల వద్ద అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్ : ఆర్థిక పరిస్థితి బాగోలేక మనస్థాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. బలగ ఆదివారంపేటకు చెందిన బలగ సీతారాం (40)కు భార్య రాధ, ఇద్దరు కుమారులు. దంపతులిద్దరూ కూలిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సీతారాంకు చిన్న చిన్న అప్పులు, మద్యం అలవాటు ఉండటంతో నిత్యం తాగుతూ ఇంటికి వచ్చేవాడు. భార్య తాగడం మానమని చెబితే.. మానాలని ఎంతో ప్రయత్నిస్తున్నా.. తన వల్ల కావడం లేదంటూ ఎప్పుడూ బాధపడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లోని శ్లాబ్ హుక్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

మహిళా పోలీసులే కీలకపాత్ర పోషించాలి



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ప్రతి మహిళా పోలీసు గ్రామస్థాయిలో నేర నియంత్రణలో ముఖ్య భూమిక పోషించాలని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న మహిళా పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహిళా పోలీసులకు ముఖ్యంగా వారి విధి విధానాలు, సమస్యలు, ప్రజా, మహిళా భద్రత, యువత సన్మార్గంలో నడిచేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎటువంటి సమస్య ఉన్నా నేరుగా శుక్రవారం గ్రీవెన్స్‌డేలో విన్నవించుకుంటే పరిష్కరిస్తామంటూ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో సీఐ బూర ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,750–00
బంగారం(22సి. 10గ్రా.)	55,700–00
వెండి (కిలో)	82,400–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204

బోధనలో డిజిటల్ విప్లవం!

- ఐఎఫ్‌పీ ద్వారా పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు
- ఉపాధ్యాయులకు సులభతరం అవుతున్న బోధన



ఐఎఫ్‌పీ ద్వారా బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

శ్రీకాకుళం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థ పటిష్టతకు అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా దేశంలోనే ప్రప్రథమంగా పాఠశాల స్థాయిలో డిజిటల్ తరగతులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇవి విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. ఇటీవలే 1511 ఐఎఫ్‌పీ (ఇంటరాక్టీవ్ ఫ్లాట్ ప్యానల్)ను జిల్లాకు సరఫరా చేశారు. తొలి విడతలో నాడు-నేడు పనులు పూర్తయిన అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో వీటిని అమర్చారు. జిల్లాపరిషత్, ప్రభుత్వ, గురుకులాలు, కేజీబీవీలు, మోడల్, మున్సిపల్ పాఠశాలలు ఇందులో ఉన్నాయి. అత్యంత ఖరీదైన ఐఎఫ్‌పీలను గదికి ఒకటి చొప్పున మంజూరు చేశారు. బ్లాక్‌బోర్డుకు బదులుగా దీనిని వినియోగించుకోవచ్చని చెబుతున్నారు.

ఐఎఫ్‌పీ బోర్డులతో ఉపయోగాలు..

- విద్యార్థులు శ్రద్ధగా నేర్చుకునేందుకు, చిత్రాల ద్వారా బోధన చేయడానికి ఉపయోగకరంగా ఉంటాయి. త్వరగా పాఠంలోని అంశాలను గ్రహించగలుగుతున్నారు. తెలివైన వారితోపాటు చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులు సైతం శ్రద్ధగా పాఠాలు వినేందుకు దోహదపడతాయి.
- గతంలో గ్రాఫ్, మ్యాప్, సైన్స్ చిత్రాలు వేసేందుకు ఎంతో వ్యవధి పట్టేది. ఇపుడు గూగుల్‌లో ఉన్న చిత్రాలను, పాఠాలను చూపిస్తుండడం వలన సమయం ఆదా అయ్యి ఎక్కువ పాఠం చెప్పేందుకు వీలవ్వడంతోపాటు బోధన ఉపాధ్యాయులకు సులభతరం అవుతోంది.
- గతంలో ఉపాధ్యాయుడు సెలవు పెడితే ఆ తరగతికి వేరొక ఉపాధ్యాయున్ని పంపించేవారు. ఇపుడు అలా కాకుండా సదరు ఉపాద్యాయుడు ముందురోజుగానే పాఠం రికార్డు చేసి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లో ఉంచితే ఆ విద్యార్థి ద్వారా ఐఎఫ్‌పీ ద్వారా బోధన చేయించవచ్చు. ఐఎఫ్‌పీని తాకి వినియోగించడం రాకుంటే విద్యార్థులు తమ వాయిస్‌ను వినియోగించుకోవడం ద్వారా ఐఎఫ్‌పీను వినియోగించుకోవచ్చు. ఉపాధ్యాయుడు బోధించిన పాఠాన్ని ఐఎఫ్‌పీలో ఉండే గూగుల్ బాక్స్‌లో సేవ్ చేస్తే ప్రపంచమంతా దీనిని చూడగలుగుతుంది. ఈ విధానం వలన ఏ ప్రాంతంలో అయిన ఉపాధ్యాయుడు కొత్త మెలకువలను ఉపయోగించి బోధనచేస్తే అవి తెలుసుకునేందుకు వీలు కలుగుతుంది.
- త్వరలోనే ప్రతి పాఠశాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఇదే జరిగితే తరగతి పాఠాలతో పాటు పురాణాలు, కథలు, గ్రామరు, ఇంగ్లిషు మాట్లాడడం వంటివి కూడా నేర్చుకోవచ్చు. ప్రస్తుతం ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్‌కు ఉన్న ఇంటర్నెట్‌ను ఐఎఫ్‌పీలకు అనుసంధానం చేసి బోధన సాగిస్తున్నారు.

విద్యార్థులు శ్రద్ధగా వింటున్నారు



ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా బోధన చేస్తుండడం విద్యార్థులకు బాగా నచ్చింది. ఎంతో శ్రద్ధగా పాఠాలు వినడంతో పాటు మరిన్ని నేర్చుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌లు ఎంతో ఉపయోగకరంగా మారాయి.

– కృష్ణవేణి, ప్రధానోధ్యాయురాలు

బోధన సులభతరం



ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌లు వలన బోధన సులభమైంది. విద్యార్థులు ఇంటి వద్ద కూడా ట్యాబ్‌లు వినియోగించి పాఠాలు నేర్చుకుంటున్నారు. సందేహం ఉంటే వెంటనే ఉపాధ్యాయునికి ఫోన్ చేసి సందేహాన్ని నివృత్తి చేసేందుకు ట్యాబ్‌లు ఉపయోగపడుతున్నాయి. ఐఎఫ్‌పీల వలన పాఠంలోని అంశాన్ని త్వరగా గ్రహించగలుగుతున్నారు.

–పేడాడ ప్రభాకరరావు, స్కూల్ అసిస్టెంట్

బాగా అర్థమౌతున్నాయి



ఐఎఫ్‌పీ ద్వారా పాఠాలు నేర్చుకోవడం సులభంగా ఉంది. పాఠం మీద సందేహం ఉంటే ఇంట్లో ట్యాబ్‌ల ద్వారా వాటిని నివృత్తి చేసుకోగలుగుతున్నాం. ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీలు వచ్చిన తర్వాత పాఠాలు మరిన్ని నేర్చుకోవాలనే ఇష్టం పెరిగింది.

– గుడ్ల హిమజ, విద్యార్థిని

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



సివిల్స్ విజేత కళ్యాణిని సత్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- సిక్కోలు ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ లక్ష్యంతో పనిచేస్తే తప్పక విజయం సిద్ధిస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. డాక్టర్ దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం పాతబస్టాండ్ సమీపంలో సిక్కోలు ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో నెంబర్ వన్ స్థానంలో ఉంటుందన్నారు. డాక్టర్ శ్రీధర్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి మాట్లాడుతూ వైద్య రంగంలో ఉన్నత స్థాయికి చేరిన శ్రీధర్ సేవా రంగంలోనూ అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన తాను కష్టపడి చదివి వైద్య నిపుణుడిగా రెండు దశాబ్దాలకు పైగా ప్రజల్లో గుర్తింపు పొందానన్నారు. ట్రస్టును విజయవంతంగా నిర్వహించేందుకు కన్వీనర్ బాధ్యతను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గుంట తులసీరావుకు అప్పగిస్తున్నామన్నారు. అనంతరం జిల్లా నుంచి ఐఏఎస్‌కు ఎంపికైన చల్ల కళ్యాణి, జాతీయ స్థాయి నీట్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించిన పొట్నూరు అశీష్‌లను సత్కరించారు. సిక్కోలు ఎక్సలెన్స్ అవార్డ్స్ కోసం రూ.20 లక్షల చెక్కును డాక్టర్ శ్రీధర్ అతిథుల చేతుల మీదుగా అందజేశారు. అనంతరం మోటివేషనల్ స్పీకర్ బ్రదర్ షఫీ విద్యార్థులను ఉత్తేజపరిచేలా ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్పీ జి.ఆర్.రాధిక, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, డాక్టర్ దానేటి రాధ, దానేటి మహతి, డాక్టర్ పొట్నూరు సూర్యం, రిటైర్డ్ డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు, విద్యావేత్తలు డాక్టర్ జామి భీమశంకర్, దుప్పల వెంకటరావు, డాక్టర్ నిక్కు అప్పన్న, అంధవరపు ప్రసాద్, సంతోష్, సువ్వారి గాంధీ, సిరిపురం తేజేశ్వరరావు, కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణు, ఈఈ పాగిరి సుగుణాకర్, బుడుమూరు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సాగుతో రైతులకు లబ్ధి

- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జేసీ నవీన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు మరింత లబ్ధి చేకూరేలా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో వ్యవసాయ సలహా మండలి రైతులకు అందిస్తున్న సేవలు అమోఘమని కితాబిచ్చారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కేవలం వ్యవసాయమే కాకుండా అనుబంధ సంస్థల్లోని రైతులకు కూడా మేలు జరిగేలా సలహా మండలి సభ్యులు సూచించి, ఆచరించడం అభినందనీయమన్నారు. విత్తనం నుంచి విక్రయం వరకు రైతులకు లబ్ధిచేకూరేలా చేస్తున్న బృందాన్ని అభినందిస్తున్నానని, ఇది ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ మాట్లాడుతూ జిల్లాలో సంపూర్ణ యాంత్రీకరణ ద్వారా తక్కువ ఖర్చుతో వరి సాగు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 50 ఎకరాలు క్లస్టరుగా తీసుకొని లక్ష ఎకరాల్లో సంపూర్ణ యాంత్రీకరణ జరిగేలా లక్ష్యం నిర్దేశించామని, తద్వారా రైతుకు ఎకరాకు రూ.5వేలు వరకు తగ్గే అవకాశం ఉందన్నారు. వరినాటు యంత్రంతో ఉడుపు, రోటరీ ఫీడరుతో గాబు తీత, డ్రోన్లతో పురుగులు, తెగుళ్ల మందులు పిచికారీ వంటి వాటికి శ్రీకారం చుట్టామన్నారు. వైఎస్ఆర్ పశు బీమాలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు.
- జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ మాట్లాడుతూ జూన్‌లో ఆశించిన స్థాయిలో వర్షపాతం లేనప్పటికీ, ఈ నెలలో కురుస్తున్న వర్షాలతో వ్యవసాయానికి అనుకూలంగా మారిందన్నారు. వర్షాలు లేకుంటే శాస్త్రవేత్తలు సూచించిన వరి వంగడాలతో పాటు జొన్న, రాగి, కంది, మినుము, పెసర, చెరకు వంటి పంటలు వేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 640 మంది కౌలు రైతులకు కౌలుదారు పత్రాలు అందజేశామన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే వచ్చే నెల 5 లోగా దరఖాస్తు చేసుకుంటే ఆ నెలాఖరులోగా పత్రాలు మంజూరుచేస్తామని, వారికి మాత్రమే రైతు భరోసా అందుతుందని స్పష్టం చేశారు.
- రాగోలు వ్యవసాయ పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల వర్షపాతం ఆశాజనకంగా ఉందని, వరి పంటకు మేలు చేకూరుతుందన్నారు. నీటి సాంద్రతను బట్టి ఎంటీయూ 1224, 1121 రకాలు అనుకూలంగా ఉంటాయని వివరించారు.
- వంశధార పర్యవేక్షక ఇంజినీర్ డోల తిరుమలరావు మాట్లాడుతూ ఈ నెల 8న వైఎస్సార్ జయంతి సందర్భంగా ఖరీఫ్ పంటలకు సాగునీటిని విడుదల చేశామన్నారు. ప్రస్తుతం 6వేల క్యూసెక్కుల నీరు లభ్యంగా ఉండగా 3 వేల క్యూసెక్కులు మాత్రమే సాగునీరు అవసరం ఉంటుందన్నారు. ఈ ఏడాది సాగునీటికి ఎటువంటి సమస్య లేదని ఆయన స్పష్టం చేశారు.
- నారాయణపురం పర్యవేక్షక ఇంజినీర్ మాట్లాడుతూ 37 వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు అవకాశం ఉన్నందున ఈ ఏడాది సాగునీటి సమస్య లేదని చెప్పారు. సమావేశంలో శాసన మండలి సభ్యులు నర్తు రామారావు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జిల్లా నీటిపారుదల సలహా మండలి రాష్ట్ర వ్యవసాయ మిషన్ సలహా మండలి సభ్యులు గొండు రఘురామ్, నాబార్డు డీడీఎం వరప్రసాదరావు, ఎల్‌డీఎం ఎం.సూర్యకిరణ్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఆర్.వి.ప్రసాదరావు, మత్స్య, పశుసంవర్ధక శాఖల సంయుక్త సంచాలకులు పి.వి.శ్రీనివాసరావు, ఎం.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై 'స్పందన'

- కలెక్టర్‌కు 50 వినతులు



వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీవో సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మొదటిసారిగా ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా మూడో శుక్రవారం స్పందన కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో వ్యక్తిగతంగా కాకుండా ఉద్యోగులు సంఘాల వారీగా ఆయా శాఖలకు సంబంధించి 50 సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

- జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం తరపున రాష్ట్ర నాయకులు పి.వేణుగోపాలరావు, జిల్లా శాఖ అధ్యక్షుడు కె.శ్రీరాములు, కార్యదర్శి బి.వి.ఎస్.రాజు, జి.ఎల్.శ్రీను, పి.శ్రీను, సోనీకిరణ్ తదితరులు కలెక్టరుని కలిశారు. రెవెన్యూ శాఖలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు నిర్వహించాలని కోరారు. ఖాళీగా ఉన్న తహశీల్దారు పోస్టులను అప్రూవల్ ప్యానెల్ సీనియర్ ఉప తహశీల్దార్లకు మాత్రమే ఎఫ్ఏసీ కల్పించాలని విన్నవించారు. వివిధ కేడర్ల ఉద్యోగుల సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలని కోరారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ ఉద్యోగుల డిసిప్లినరి కేసులు పరిష్కరించాలన్నారు. గ్రేడ్-1 వీఆర్‌ఓ పోస్టుల ప్రొబేషన్ రెగులర్ చేయాలని, గ్రేడ్- 2 వీఆర్‌ఓలకు పదోన్నతులు కల్పించాలని కోరారు.
- ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమ నాయుడు, జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, రాయి వేణు, పూర్ణచంద్రరావు కలెక్టర్‌ను కలిశారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఆర్థిక అంశాలతో పనిలేని, కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారుల పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు.
- జేఎల్ఎం గ్రేడ్ –2లను సచివాలయం ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రొవిజన్ డిక్లేర్ చేసి, ట్రెజరీల ద్వారా జీతాలు చెల్లించాలని, విధి నిర్వహణలో మరణించిన కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, సర్వీస్ రిజిస్టర్ అందించాలని జేఎల్‌ఎం గ్రేడ్-2 ఉద్యోగులు, సచివాయ ఎనర్జీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు పి.రమణ, సురేష్, గోవింద్, అప్పారావు, కృష్ణారావు తదితరులు కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పి.మురళీకృష్ణ, జెడ్పీ సీఈవో ఆర్.వెంకటరామన్, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నాగభూషణరావు మృతి తీరని లోటు




నాగభూషణరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాతపట్నం : పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి భర్త రెడ్డి నాగభూషణరావు మృతితో నియోజకవర్గంలో మంచి నాయకుడిని కోల్పోయామని పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు అన్నారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నాగభూషణరావు తృతీయ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొర సావిత్రి, ఏఎంసీ చైర్మన్ అర్జునుడు, మండల సచివాలయ కన్వీనర్ సూర్యం, ఎస్ఎంపీపీ ప్రదీప్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు అప్పన్న, ఆలయ చైర్మన్ ఎస్.ఈశ్వరరావు, కర్రి లక్ష్మినారాయణ, పనుకు మోహన్, అమర ఉషా, రాము, చిన్నారావు, జోగారావు, నేతాజీ, ధనుంజయ, వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గోదాముల్లో విజిలెన్స్ తనిఖీలు

నరసన్నపేట: నరసన్నపేటలోని ఎస్‌వీఎల్ రైస్‌మిల్లు, అనుబంధ గోదాముతో పాటు మరో నాలుగు గోదాముల్లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ డీఎస్పీ కిరణ్‌కుమార్, ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో సీఎంఆర్ రైస్ నిల్వ, రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో నరసన్నపేట సివిల్ సప్లయ్ డీటీ డబ్బీరు రామకృష్ణ, విజిలెన్స్ హెచ్‌సీ రామ్మోహనరావు పాల్గొన్నారు.

'అభివృద్ధిని అడ్డుకునేందుకే ఫేక్ ఫిర్యాదులు'



మండవిల్లి రవి

అరసవల్లి:అరసవల్లి ఆలయంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను ఏదోవిధంగా అడ్డుకునేందుకు కొందరు పనిగట్టుకుని ఫేక్ ఫిర్యాదుల లేఖలు రాస్తున్నారని..ఇది మంచి పద్ధతి కాదని పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి మండిపడ్డారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు పర్యాయాలుగా ఆలయ పాలక మండలి సభ్యునిగా కొనసాగుతున్నానని, తానే స్వయంగా ఎందరో భక్త దాతలను ఆలయానికి రప్పించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు విరాళాలు ఇప్పించానని.. వారి పర్యవేక్షణలోనే పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని.. ఇందులో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ ఫిర్యాదులు చేస్తున్న వ్యక్తులు ధైర్యముంటే ఆధారాలతో ఆలయ పాలకమండలిని సంప్రదించాలని సవాల్ విసిరారు. ఊరూ పేరూ లేకుండా ఫిర్యాదులు చేయడంతో ఏం సాధిస్తారని ప్రశ్నించారు. ఆలయంలో అధికారిక సమాచారాన్ని కొందరు ఉద్యోగ సిబ్బందే బయటవారికి చేరవేస్తున్నట్లుగా 'సాక్షి'లో శుక్రవారం ప్రచురించిన 'ఆదిత్యాలయంలో ఇంటి దొంగలు' అన్న కథనంపై స్పందిస్తూ.. ఇలాంటి అధికార సిబ్బందిపై విచారణ చేయాల్సిందేనని, ఈ అంశంపై ఈ నెల 25న జరుగనున్న పాలకమండలి సమావేశంలో సభ్యులంతా చర్చిస్తామని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధి ధ్యేయంగా తామంతా కృషి చేస్తున్నామని, మరికొద్ది రోజుల్లోనే ఆలయ ఇంద్రపుష్కరిణి అభివృద్ధి పనులకు మంత్రి ధర్మాన శంకుస్థాపన చేయనున్నారని, త్వరలో వసతిగదుల కాంప్లెక్స్ నిర్మాణం, అధునాతన కిచెన్ ఏర్పాటు తదితర పనులన్నీ చేపడుతున్నామని ప్రకటించారు.

ఎన్‌సీఈఆర్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా జగన్మోహన్‌రావు



పొందూరు: మండలంలోని మజ్జిలిపేట గ్రామానికి చెందిన గురుగుబెల్లి జగన్మోహనరావు ఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించారు. ఈయన ప్రస్తుతం నాగాలాండ్ రాష్ట్రంలో కోహిమాలోని మోడరన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఎన్‌సీఈఆర్‌టీలో ఉద్యోగం సాధించడంపై తండ్రి వేణుగోపాలరావు, తల్లి అండాలమ్మ, భార్య శ్రావణి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు అస్వస్థత

- క్లోరోక్విన్ మాత్రలు రియాక్షన్ ఇవ్వడంతో ఘటన
- ఆందోళన అక్కర్లేదన్న వైద్యులు



అస్వస్థతకు గురైన విద్యార్థినిలకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

మందస: మలేరియా నివారణ కోసం పంపిణీ చేసిన క్లోరోక్విన్ మాత్రలు రియాక్షన్ ఇవ్వడంతో మందస మండలం బుడంబో గిరిజన ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం 35 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వీరికి సకాలంలో వైద్య సేవలు అందించడంతో పరిస్థితి సద్దుమణిగింది. గిరిజన ప్రాంతాల్లో మలేరియా ఎక్కువగా ఉండడంతో ఆయా ప్రాంతాల్లో క్లోరోక్విన్ మాత్రలు అందించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో గల పీహెచ్‌సీల నుంచి మాత్రలను పంపిణీ చేస్తున్నారు. దీనిలో భాగంగా బుడంబో కాలనీ పీహెచ్‌సీకి చెందిన ముగ్గురు సిబ్బంది ఆశ్రమ పాఠశాలకు చేరుకుని, ఉదయం 10.30 గంటల సమయంలో మాత్రలు పంపిణీ చేశారు. ఈ మాత్రలను టిఫిన్, భోజనం చేసిన అనంతరం వేసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. అయితే ఉదయం 7.30 నుంచి 8 గంటల మధ్య గిరిజన విద్యార్థినులు టిఫిన్ చేశారు. టిఫిన్ తర్వాత పిల్లలు మాత్రలు వేసుకోవడంతో అది రియాక్షన్ ఇచ్చింది. 6వ తరగతి నుంచి 8వ తరగతి చదువుతున్న సుమారు 65 మంది విద్యార్థినులకు మాత్రమే టాబ్లెట్స్ అందజేశారు. వీరిలో ముందుగా 8వ తరగతి చదువుతున్న కె.సుస్మితకు అసౌకర్యం అనిపించింది. కొద్దిసేపటికే ఒక్కొక్కరూ అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే దగ్గరలో ఉన్న బుడంబో కాలనీ పీహెచ్‌సీకి విద్యార్థులను తీసుకెళ్లారు. వీరిలో కొందరి పరిస్థితి ఇబ్బందికరంగా ఉండడంతో ఆస్పత్రిలోని ప్రత్యేక గదులతో పాటు సమీపంలోని తోటలో ఉంచి కూడా డాక్టర్ రవికుమార్ దొర, సిబ్బంది వైద్యమందించారు. విషయం తెలిసి విద్యార్థినుల తల్లిదండ్రులు అక్కడకు పాఠశాలకు చేరుకున్నారు. 8వ తరగతి చదువుతున్న జ్యోత్స్న పరిస్థితి ఆందోళనగా ఉండడంతో పలాస తీసుకెళ్లారు. బుడంబో పీహెచ్‌సీ సెకెండ్ మెడికల్ అధికారి డాక్టర్ పూర్ణరవిచంద్ర విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడారు. యాంటీడోస్ ఇచ్చామని, భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. హెచ్ఎం కె.తిరుపతిరావు మీటింగ్‌కు సీతంపేట వెళ్లారని ఉపాధ్యాయులు చెప్పారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, సర్పంచ్ సవర సంధ్య, తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సవర రాము, మద్దిల రామారావు, సవర బాలకృష్ణ, మార్పు కృష్ణమూర్తి, హుటాహుటిన చేరుకుని విద్యార్థినులకు ధైర్యం చెప్పారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్రమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బాధిత విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. పలాసలో విద్యార్థినిని పరామర్శించారు. అలాగే ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి కూడా ఘటనపై ఆరా తీశారు. డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి కూడా పాఠశాలకు వచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ క్లోరోక్విన్ మాత్రలకు సైడ్ ఎఫెక్ట్‌లు ఉంటాయని, టిఫిన్ అనంతరం కాస్త సమయం దాటాక టాబ్లెట్స్ వేసుకోవడంతో ఇబ్బంది వచ్చి ఉంటుందని తెలిపారు. బుడంబో కాలనీ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను డిశ్చార్జి చేశామని, పలాసలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరిస్థితి మెరుగుపడడంతో ఆశ్రమానికి తీసుకువచ్చామని, డాక్టర్ రవికుమార్‌దొర, డాక్టర్ పూర్ణరవిచంద్రలతో సిబ్బందిని రాత్రంతా విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై పర్యవేక్షణ చేయడానికి నియమించామని చెప్పారు.



చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు